క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, హరిరమాదేవి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

23లోపు దరఖాస్తు చేసుకోవాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (భూపాలపల్లి)లో 2025 - 26వ విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌టీడీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీకాం(సీఏ), బీకాం(బీఏ) కోర్సుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 91210 04528, 70134 64418, 95028 35848 నంబర్లలో సంప్రదించాలని విజయలక్ష్మి సూచించారు.

ఆర్ట్స్ కళాశాల స్వయం కోఆర్డినేటర్‌గా నాగయ్య



కేయూ క్యాంపస్: నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గణిత విభాగ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న టి.నాగయ్యను స్వయం కోఆర్డినేటర్‌గా నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి గురువారం ఉత్తర్వులు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న స్వయం, మూక్స్ వేదికల ద్వారా వివిధ సర్టిఫికెట్ కోర్సులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని జాతీయ స్థాయి సర్టిఫికెట్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం



హన్మకొండ కల్చరల్: యోగాతో ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కలుగుతుందని టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యోగాసనాల కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. యోగా గురువు పోశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని వైబ్రెంట్ జూనియర్ కళాశాల, పిన్నావారి వీధిలోని శారద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



హన్మకొండ: వరంగల్ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నరసింహారావుకు డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం (ఈఈఈ)లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముచ్చర్ల నరసింహారావు డాక్టరేట్ అందుకున్నారు. 'ఫాల్ట్ టాలరెంట్ మల్టీలెవల్ ఇన్వర్టర్స్ ఫర్ సోలార్ వాటర్ పంపింగ్ అప్లికేషన్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని ఫాగ్వారా లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఎల్‌పీ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తీక్, కిట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకర్‌రావు సంయుక్త పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

డే కేర్ సెంటర్‌ను సందర్శించాలి



హన్మకొండ అర్బన్: జిల్లా పరిషత్ ప్రాంగణంలో వయోవృద్ధులకు మానసిక ప్రశాంతత అందించేందుకు ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను సందర్శించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, చితురాల సత్యనారాయణ, మార్క రవీందర్‌గౌడ్, గంగారపు యాదగిరి, తాడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలో సమస్యలు

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డు



రోడ్డు పక్కన పడేసిన చెత్తాచెదారం



డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఖిలా వరంగల్: పడమరకోట 37, 38వ డివిజన్ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సౌకర్యాలు కరువు

ఎస్సీ, ఎస్టీ కాలనీలో జనాభాకు తగ్గట్లుగా సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పడమర కోట జంక్షన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు గుంతలమయమైన సీసీ రోడ్లు, చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేళాపాల లేకుండా తగినంత తాగునీటి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్లపైనే నిలుస్తోందని అంటున్నారు. అపరిశుభ్ర పరిసరాలతో దోమలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మురుగునీటి కాల్వలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదని తెలిపారు. రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం, వ్యర్థాలతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో వీధి దీపాలు వెలగక అంధకారంలోనే మగ్గుతున్నామని అంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి



పడమర కోట జంక్షన్ నుంచి ఎస్సీ, ఎస్టీ కాలనీకి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, ఈగలతో వ్యాధుల బారిన పడుతున్నాం. నల్లాల నీరు తగినంత రావడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

- తోటకూరి రాజేశ్వరి, పడమర కోట

మారణ హోమం సృష్టిస్తున్న ఇజ్రాయెల్



హన్మకొండ: నిరసన తెలుపుతున్న నాయకులు



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద..

- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన

హన్మకొండ: పాలస్తీనా, ఇరాన్ ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ చేస్తున్న మారణ హోమాన్ని, దాడులను ఆపి శాంతిని నెలకొల్పాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా నాయకుడు రాగుల రమేష్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు గంగుల దయాకర్, ఆర్ఎస్‌పీ జిల్లా నాయకుడు కొండగాని శివాజీ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఆర్ఎస్‌పీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ధర్నాలో ఆయా పార్టీల నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మండ సదాలక్ష్మి, ఎన్ఏ.స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, బాషబోయిన సంతోష్, ఏదునూరి వెంకట్రాజం, రవి పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులను ఖండించాలి

ఖిలా వరంగల్: ఇరాన్, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దురహంకార దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. వరంగల్ అండర్ బ్రిడ్జి బస్టాండ్ వద్ద వామపక్ష పార్టీలు, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, సీపీఎం నాయకుడు వల్లందాసు దుర్గయ్య, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి, ఐలయ్య, వల్లందాసు కుమార్, చిర్రసూరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో నాయకులు

కాజీపేట అర్బన్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ గురువారం పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ బస్కే శ్రీలేఖకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకట రమణగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కట్కూరి రమేష్, శీలం రమేష్‌కుమార్, కట్కూరి రేవంత్, నర్మెట వేణుగోపాల్ గౌడ్, విజ్జగిరి, మధు, కోటేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనందించాలి



నోట్‌బుక్స్ అందజేస్తున్న కందిమల్ల మహేష్

ఖిలా వరంగల్: తూర్పుకోట ప్రాథమిక పాఠశాలలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని అన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతి, వారి ఎదుగుదలకు సామాజిక సేవకులు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కర్నె రవీందర్, కర్నె వాసుదేవ్, గందె గోపి, నిహారిక, రాజ్‌కుమార్, నాంద్రె అమర్‌నాథ్, అమత్, నాగేందర్, పెసరు కుమార్, ఏసీరెడ్డి రంజిత్, వంశీ, రఘునాథ్, జనార్దన్, రవి, చిరంజీవి, హస్తిక్, వినయ్, కమలాకర్, కిరణ్, అనిల్, ప్రదీప్ పాల్గొన్నారు.

జీఓ 58 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హన్మకొండ అర్బన్: పలివేల్పుల గ్రామం భగత్‌సింగ్ నగర్‌లో 2007 నుంచి నివాసముంటున్న 200 కుటుంబాలకు జీఓ 58 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి రాజుల రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానికులతో కలిసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ రంజిత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ అక్కడ నివాసముంటున్న పేదలకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఇంటి పన్ను రసీదులు, కరెంట్ బిల్లులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు వేలు రజిత, మంద సుచందర్, వేలు సుమన్, సాదు సుధాకర్, కుర్ర పద్మావతి, తన్నీరు భూలక్ష్మి, జడ అశ్విని, అచ్చమ్మ, అరుణ, బూతు స్వాతి, తార, కాంతమ్మ, కొయ్యడ అనిత, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

హన్మకొండ: బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 21న చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు పిలుపునిచ్చారు. హనుమకొండ సుబేదారిలో బీసీ జేఏసీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, పూలే విద్యాజ్యోతి పథకంలో 300 మంది బీసీ విద్యార్థులకు అవకాశం కల్పించాలని, సంచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు దారబోయిన సతీష్, నూతనకంటి ఆనందం, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్ పాల్గొన్నారు.

పింగిళి కళాశాలలో ప్రవేశాలు పొందాలి



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల కళాశాలలో ఇంటర్‌లో వివిధ గ్రూప్‌లలో విద్యార్థినులు అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ కవిత కోరారు. క్యాంపెయిన్‌లో భాగంగా హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో గురువారం ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పూర్తిచేసిన బాలికలు తమ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కొలిపాక మధు, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ హెచ్ఎం జగన్నాథం, లక్ష్మణాచారి, రాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని



కేక్ కట్ చేస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

న్యూశాయంపేట: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా 14వ డివిజన్ ముసలమ్మకుంటలో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తో పేదల ఇంటి కల సాకారం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటి కల సాకారమవుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లి ఎస్సీ కాలనీ, సమ్మయ్యనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చామని, ఇప్పుడూ మరలా ఇళ్లు ఇస్తున్నట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 3,500 ఇళ్లను అర్హులకు మాత్రమే కేటాయించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు ఎనుకంటి నాగరాజు, బంక సంపత్ యాదవ్, తాళ్లపల్లి సుధాకర్, మండల సమ్మయ్య పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

హన్మకొండ చౌరస్తా: 68మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి చెక్కులను హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ ఫలాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి నిర్వాహకులు

- సఖి కేంద్రం లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

హన్మకొండ చౌరస్తా: బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రం అండగా ఉంటోందని ఆ సంస్థ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. హనుమకొండలోని కొత్తూరు జెండా సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వేధింపులు, అత్యాచారాలు, దాడుల నుంచి రక్షణ పొందడానికి సఖి సెంటర్ అండగా ఉంటుందని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్‌లైన్ నంబర్ 1098 లేదా 0870 2452112, 73829 83088 నంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ సహాయం, రక్షణ పొందవచ్చని వివరించారు. సఖి కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ భారతి, పుష్ప, మౌనిక, కళావతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి



హన్మకొండ: మాట్లాడుతున్న అశోక్ నాయక్

హన్మకొండ: తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి జి.అశోక్ నాయక్ సూచించారు. హనుమకొండ అంబేద్కర్ కూడలిలోని ప్రధాన తపాలా కార్యాలయంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ ద్వారా అనేక పథకాలు అమలవుతున్నాయని అన్నారు. రైల్వే రిజర్వేషన్, పాస్‌పోర్టు సేవలు, పార్శిల్ బుకింగ్, రవాణా, ప్యాకింగ్, ఆధార్ కార్డు నమోదు, సవరణలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే, జీవిత బీమా, యాక్సిడెంట్ బీమా పాలసీలు, అనేక పొదుపు పథకాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ప్రధాన తపాలా కార్యాలయం అసిస్టెంట్ సూపరింటెండెంట్ మూల రమాదేవి, పోస్టుమాస్టర్ కె.వి.పవన్ కుమార్, తపాలా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తపాలా సేవలు

గీసుకొండ: ప్రజలకు విస్తృతంగా సేవలు అందించడానికి తపాలా శాఖ ముందుకు వస్తోందని వరంగల్ సౌత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.వరప్రసాద్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం తపాలా కార్యాలయంలో గురువారం నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ)లో ఆయన మాట్లాడారు. ధర్మారం పోస్ట్‌మాస్టర్ నీలిమ, సిబ్బంది రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లు ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యార్థుల సౌకర్యార్థం వివిధ వసతి గృహాల్లో పరిశుభ్రమైన తాగునీటి కోసం బాలవికాస, కేయూ సంయుక్తంగా ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటుచేసింది. పద్మాక్షి మహిళా హాస్టల్, సుబేదారి న్యాయ కళాశాల హాస్టల్, ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కేయూలో ఏడు యూనిట్ల వాటర్ ప్లాంట్లకు రూ.9 లక్షల 80వేలు వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ ఎల్.పి.రాజ్‌కుమార్, అకుట్ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, ప్రొఫెసర్లు సవితాజ్యోత్స్న, మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, డాక్టర్ సుజాత, డాక్టర్ నరేందర్, రాజు, డాక్టర్ చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ చేయూత

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ ఫర్ బీయింగ్ హెల్పింగ్ హ్యాండ్ సర్వీస్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. ఈ మేరకు విద్యార్థులకు పలుకలు, బ్యాగులను స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బోగి మహేందర్, మహేష్, విజయ్, రఫీ గురువారం అందజేశారు.

శ్వేతార్క ఆలయంలో వరుణ పూజలు

కాజీపేట: వర్షాలు కురవాలని కాజీపేటలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో పట్టణ మహిళలు వంద కుండల నీటితో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు సాయికృష్ణ శర్మ దంపతులు 108 కొబ్బరికాయలు కొట్టి సహస్ర ధారాభిషేకం చేశారు. రాధాకృష్ణ శర్మ పర్యవేక్షణలో రుద్ర నమకచమక పారాయన సహిత పూజలు చేశారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హరిస్వామి, నారాయణ శర్మ, మణిదీప్, మహతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: తమ సమస్యలు పరిష్కరించాలని న్యాయ కళాశాల విద్యార్థులు కోరారు. ఈ మేరకు సుబేదారి లా హాస్టల్‌కు గురువారం వచ్చిన కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు స్టాలిన్, సందీప్, అరుణ్, సుకుమార్, పవన్, రూపేష్, శంకర్, గణేష్, రణధీర్, శివాజీ, జీతన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గొప్ప సేవలందించాలి

కాజీపేట: ఉన్నత ఆశయాలతో ఏర్పడిన క్రిస్టియన్ ఫెలోషిప్ ఉన్నత భావాలతో క్రైస్తవ సమాజానికి, ప్రజలకు గొప్ప సేవలు అందించాలని బిషప్ డేనియల్ కళ్యాణపు సూచించారు. కాజీపేట ఆల్ఫా ఒమేగా చర్చి ఆవరణలో గురువారం రాత్రి క్రిస్టియన్ ఫెలోషిప్ శిక్షణను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిషప్ మార్టిన్ లూథర్, కార్యదర్శి మార్క్ పీటర్, కోశాధికారి నిఖిల్ జాన్, బిషప్ జాన్ మార్కండేయ, పాస్టర్ కురియన్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టేను ధిక్కరించిన కాంట్రాక్టర్

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. సబ్‌స్టేషన్ నిర్మాణ కోసం గురువారం బోరు వేయడానికి కాంట్రాక్టర్ బోరు బండితో రాగా, సదరు భూమి తమ కులస్తులదని, ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించిందని స్థానిక మాలకులస్తులు అడ్డుకున్నారు. వద్దని చెప్పినా బోరు వేయడానికి కాంట్రాక్టర్ రావడంతో వారు 100 నంబర్‌కు డయల్ చేశారు. పరిశీలించిన పోలీసులు బోరు వాహనాన్ని గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రవీందర్ రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: విద్యుదాఘాతానికి గురైన ఓ రైతు మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం సీతానాగారంలో చోటు చేసుకుంది. ఈ మేరకు కుటుంబ సభ్యులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీతానాగారానికి చెందిన సూదుల రవీందర్ రెడ్డి (55) బుధవారం నారుకు నీళ్ల పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు వివరించారు.

రామన్నపేటలో కత్తితో ఓ వ్యక్తి హల్‌చల్

రామన్నపేట: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నపేట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో కత్తితో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన తగురం సుజిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. రాత్రివేళలో కత్తి పట్టుకుని తన ఇంటి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సుజిత్‌ను విచారించగా తాను మద్యం తాగడంతో తల్లి మందలించగా కోపంతో కత్తితో పొడుచుకుంటానని బయటకు రాగా, అది చూసిన ప్రజలు భయాందోళనకు గురైనట్లు ఆయన తెలిపారని సీఐ వెల్లడించారు.

తనిఖీల్లో వాహనం పట్టివేత

రామన్నపేట: వరంగల్ పోచమ్మమైదాన్‌లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో దూరం నుంచి వస్తున్న ఓ వ్యక్తి తను చోరీ చేసిన వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం పోచమ్మమైదాన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ వాహనదారుడు పోలీసులను గమనించి బైక్‌ను కొద్ది దూరంలోనే ఆపి వదిలి పారిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్ రవి.. ఆ వాహనం వివరాలు తెలుసుకోగా, అది హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన వైనాల రమేష్‌గా గుర్తించారు. సదరు వాహనదారుడికి ఫోన్‌చేసి వివరాలు అడుగగా మే 28వ తేదీన రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనాన్ని దొంగలించారని, హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే సదరు వాహనదారుడికి వాహనం అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వివరించారు.

కేయూ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా యూనివర్సిటీ భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కేయూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేయూ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బినర్సింహారావు, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి యూనివర్సిటీ భూములు కేటాయించడానికి పాలకమండలిలో ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు యూనివర్సిటీ భూములను పోలీస్ స్టేషన్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు కోసం కేటాయించారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ యూనివర్సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పస్తం అనిల్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సనత్ జయసూర్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, బీఎస్ఎఫ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ శివ, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, విద్యార్థి సంఘాల నాయకులు సాయి కోట్ల ర్, ఉప్పుల శివ, జశ్వంత్, గణేష్, సురేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.